క్లుప్తంగా

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి



రోడ్డు ప్రమాద బాధితులను ఆస్పత్రికి తరలింపును పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: దెందులూరు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మానవత్వం చాటుకున్న వైనమిది. అసెంబ్లీ సమావేశాలు ముగించుకుని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి తిరిగి వస్తుండగా పాట్టిపాడు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదాన్ని గమనించారు. హుటాహుటిన కారు నిలుపుదల చేసి క్షతగాత్రుల వద్దకు వెళ్లి వారిని సమీపంలో ఉన్న పిన్నమనేని ఆసుపత్రికి తరలించారు. వైద్యశాల యాజమాన్యానికి ఫోన్ చేసి రోడ్డు ప్రమాద బాధితులకు మెరుగైన వైద్యసేవలందించాలని ఎమ్మెల్యే కోరారు.

ఆలయ పునఃప్రతిష్టకు ఎంపీటీసీ విరాళం



ఆలయ పునఃప్రతిష్టకు ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎంటీసీ ఏనుగు అంజలి ప్రసాద్

దెందులూరు: వేగవరంలో వీరాంజనేయస్వామివారి ఆలయ పునః నిర్మాణ, పునః విగ్రహ ప్రతిష్ఠాపనకు గోపన్నపాలెం ఎంపీటీసీ ఏనుగు అంజలి ప్రసాద్ రూ.10,116లు సోమవారం విరాళం అందజేశారు. ఎంపీటీసీ దాతృత్వానికి ఆలయ కమిటీ కృతజ్ఞతలు తెలిపారు.

వ్యక్తిగత శుభ్రతతో చర్మవ్యాధులు దూరం



ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాలలో స్కిన్ క్యాంప్‌లో మాట్లాడుతున్న డాక్టర్ సుబ్బారావు

దెందులూరు: విద్యార్థులందరూ చర్మ సంబంధిత వ్యాధుల అవగాహనతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత గురించి తెలుసుకోవాలన్నారు. చర్మానికి సంబంధించి వ్యాధి లక్షణాలు గుర్తించిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలన్నారు. సోమవారం గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ నత్తానియేల్ ఆధ్వర్యంలో విజయ ఆసుపత్రి డాక్టర్ సుబ్బారావు సిబ్బందితో విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ ప్రెసిడెంట్ దాసరి గణేష్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పీడీకేడీ ప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ శ్యామల, విజయలక్ష్మి, రమేష్ తదితరులున్నారు.

కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న వాహనం స్వాధీనం



కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనాన్ని పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న దృశ్యం

పెదవేగి : కోళ్ల వ్యర్థాలను అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని పట్టుకుని సీజ్ చేసినట్లు పెదవేగి ఎస్సై ఎం లక్ష్మణ్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి భీమడోలు కోళ్ల వ్యర్థాలు అక్రమ రవాణా జరుగుతుందని అందిన సమాచారంతో ఎస్సై తన సిబ్బందితో చేయగా, దెందులూరు మండలం ఆగడాలలంకకు చెందిన జయమంగళ లీలాప్రసాద్ అనే వ్యక్తి హైదరాబాద్ నుంచి భీమడోలు గ్రామానికి కోళ్ల వ్యర్థాలను తరలిస్తుండగా అతన్ని పట్టుకుని వాహనాన్ని సీజ్ చేసి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

నోటి పరిశుభ్రతతో ఆరోగ్యం

గణపవరం: నోటిని పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా చాలా వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు సంతోష్‌నాయుడు, కిరణ్మయి అన్నారు. సోమవారం జాతీయ ఓరల్ హెల్త్ దినోత్సవం సందర్భంగా పాఠశాలల విద్యార్థులకు నోటి పరిశుభ్రత, నోటిద్వారా వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కె.రాంబాబు, సీహెచ్‌వో జాలాది విల్సన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. పిప్పర పీహెచ్‌సీ పరిధిలోని కాశిపాడు, చిలకంపాడులో విద్యార్థులకు నోటి శుభ్రత, దంతాల సంరక్షణ, నోటి ద్వారా వచ్చే వ్యాధులు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ఆరోగ్య సహాయకుడు నామాల రాజు, హెచ్ఎంలు బి.కాంతిశ్రీ, టి.రంగనాయకులు పాల్గొన్నారు.

పాడి రైతులకు మరింత భరోసా

- బాధిత రైతులను ఆదుకుంటున్న వైఎస్సార్ పశునష్టపరిహార పథకం
- ప్రీమియం, బీమా లేకుండానే పరిహారం వర్తింపు
- పశువుకు రూ.15 వేల నుంచి రూ.30వేల వరకు మంజూరు
- ఆధార్ నంబర్‌తో సమానమైన ట్యాగ్ తప్పనిసరి



పశువులకు టోకెన్ వేస్తున్న పశువైద్యాధికారులు (ఫైల్)

పెదవేగి: వ్యవసాయ రంగానికి ప్రాధాన్యమిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సచివాలయాలకు అనుగుణంగా రైతు భరోసా కేంద్రాలను నెలకొల్పి రైతులకు నేరుగా సంక్షేమ ఫలాలు, సేవలు అందజేస్తుంది. పెట్టుబడి సాయంతో పాటు ఎరువులు, వ్యవసాయ పనిముట్లు అందజేస్తున్న సర్కార్, పాడి రైతులకు భరోసానిచ్చేందుకు వైఎస్సార్ పశునష్ట పరిహార పథకాన్ని అమలు చేస్తోంది. అదే విధంగా ఆర్బీకేలకు అనుగుణంగా పాలసేకరణ కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు చేపట్టింది వైఎస్సార్సీపీ ప్రభుత్వం. ఈ నేపథ్యంలో పాడిరైతులకు పశునష్ట పరిహార పథకం ఎంతో మేలు చేకూరుతోంది. ప్రమాదవశాత్తూ పశువులు మరణిస్తే రైతులు ఎటువంటి బీమా చేయకున్నా ప్రభుత్వం నష్ట పరి హారం అందజేస్తుంది. పశుపోషణపై ఆధారపడి జీవనం సాగిస్తున్న పాడిరైతులకు ఈ పథకం భరోసాను కల్పిస్తోంది. పెదవేగి మండలంలో పాడిరైతులకు సంబంధించి రూ.2.65 లక్షలు మంజూరైనట్లు అధికారులు తెలిపారు.

ప్రీమియం చెల్లించకుండానే పరిహారం...

పాడి రైతులు తమ పశువులకు, గొర్రెలకు, మేకలకు సంబంధించి ఏ మాత్రం ప్రీమియం, బీమా చెల్లించకుండానే ప్రభుత్వం నష్టపరిహారం అందజేస్తుంది. అయితే వ్యక్తులకు ఉన్న ఆధార్ నంబర్‌తో సమానమైన ట్యాగ్ తప్పనిసరిగా ఉండాలని అధికారులు తెలుపుతున్నారు. పశువుల గుర్తింపులో భాగంగా ట్యాగ్ (12 అంకెల నంబర్) తప్పనిసరిగా వేయించుకోవాల్సి ఉంది. ఈ పథకంపై అవగాహన లేనందున చాలామంది పాడిరైతులు నష్టపోతున్నారు.

పథకం వర్తించేందుకు అర్హతలు...

వైఎస్సార్ పశునష్ట పరిహార పథకం ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పొట్టేళ్లకు వర్తిస్తుంది. ఆవు లేదా గేదె ఒకసారి ప్రసవమై ఉండాలి. ఆవు, గేదె ఈత దగ్గర నుంచి 10, 12 సంవత్స రాలు ఉండి పాలు ఇచ్చేది ఉండాలి. గొర్రెలు అయితే కనీసం 6 నెలలు ఉండాలి. ఆవులు, గేదెలు ప్రమాదవశాత్తు మరణిస్తే తక్షణమే సమీప పశువైద్యశాల లేదా సచివాలయం లేదా వలంటీర్లకు తెలియజేయాలి. మృతి చెందిన పశువులకు పశువైద్యాధికారులు పంచనామా నిర్వహిస్తారు. పశువుల జాతి ఆధారంగా రూ. 15 వేల నుంచి రూ.30 వేల వరకు నష్ట పరిహారాన్ని అందజేస్తారు. మేకలు, గొర్రెలు చనిపోతే ఒక్కొక్క జీవానికి రూ. 6వేల వరకు పరిహారం అందిస్తారు. ప్రమాదంలో గొర్రెలు, మేకలు అయితే.. మూడుకుపైగా మృతి చెంది ఉండాలి. పశువు కళేబరం, దంత వరస యొక్క జియో టాగ్ ఫొటోలు అనుసంధానం చేయాల్సి ఉంటుంది. మృతి చెందిన పశువు యజమాని ఆధార్, బ్యాంకు ఖాతా జిరాక్స్‌లు, పశువు మరణ ధృవీకరణ పత్రం, పోస్టుమార్టం, జియో ట్యాగింగ్ ఫొటోలు, రిపోర్ట్ తదితర పత్రాలన్నీ సక్రమంగా ఉంటే పరిహారం కచ్చితంగా మంజూరవుతుంది.

పాడిరైతులకు అవగాహన కల్పిస్తున్నాం

పాడిరైతులకు వైఎస్సార్ పశునష్ట పరిహార పథకం ఎంతో ఉపయోగకరం. మృతి చెందిన పశువులకు సంబంధించి వివరాలు ఉంటే కచ్చితంగా పరి హారం మంజూరవుతుంది. పశువుకు తప్పని సరిగా ట్యాగ్ వేయించుకోవాలి. ఇంకా పథకం పై రైతులకు సరైన అవగాహన లేనందున నష్టపోతున్నారు. ఈ మేరకు తమవంతు అవగాహన కల్పిస్తున్నాం. ప్రత్యేకించి ప్రజాప్రతినిధులు వైఎస్సార్ పశునష్ట పరిహార పథకంపై చర్చలు చేయాలి. అప్పుడే ప్రభుత్వ పథకాలపై ప్రజలు అవగహన పొందుతారు.

– ఎం తారకేశ్వరరావు, పశువైద్యాధికారి పెదవేగి

175 స్థానాల్లో వైఎస్సార్ సీపీ విజయం ఖాయం

భీమడోలు: పట్టభద్రుల ఎమ్మెల్సీల ఫలితాల్లో తాము బలం పుంజుకున్నామని నియోజకవర్గ టీడీపీ నాయకులు సంబరాలు చేసుకోవడం హాస్యాస్పదంగా ఉందని వైసీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్ అన్నారు. భీమడోలులో సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయడానికి ఎమ్మెల్యేల బలం, ప్రజల మద్దతు కావాలన్న విషయం వారు గుర్తించాలన్నారు. రెండు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల్లో వైఎస్సార్ సీపీ విజయఢంకా మోగించిందన్నారు. 2024 ఎన్నికల్లో రాష్ట్రంలోని 175 స్థానాలను వైఎస్సార్ సీపీ గెలుచుకుంటుందని, ప్రజల మద్దతుతో రెండోసారి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో కి రావడం ఖాయమని ఆయన పేర్కొన్నారు.

23న వాహనాల వేలం

భీమడోలు: భీమడోలు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కార్యాలయం వద్ద ఈనెల 23వ తేదీ గురువారం అబ్కారీ శాఖ పరిధిలోని వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలకు వేలం నిర్వహిస్తామని సీఐ ఏ.సుబ్రహ్మణ్యం సోమవారం తెలిపారు. భీమడోలులో మాట్లాడుతూ ఏలూరు ఎస్ఈబీ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో వేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల వారు వేలం పాటలో పాల్గొనాలని, నిబంధనల మేరకు పాటదారుల వివరాలను తమ కార్యాలయానికి తెలియజేయాలని ఆయన కోరారు.

యువత వ్యక్తిత్వ వికాసంపై దృష్టి సారించాలి



యువత వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పిస్తున్న సెట్‌వెల్ సీఈఓ ఎండీ హెచ్ మెహరాజ్

పెదపాడు : యువత వ్యక్తిత్వ వికాసం అభివృద్ధి చేసుకోవాలని సెట్‌వెల్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎండీ హెచ్ మెహరాజ్ విద్యార్థులను కోరారు. యువజన సర్వీసుల శాఖ సెట్‌వెల్ వారి ఆధ్వర్యంలో సోమవారం పెదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కెరీర్‌గైడెన్స్ పై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము జీవితంలో ఏ రంగంలో స్థిరపడాలని అనుకుంటున్నామో ఆ రంగంలో రాణించేందుకు పునాదులు ఇప్పటి నుంచే వేసుకోవాలన్నారు. పాఠశాల విద్య అనంతరం ఉన్నత విద్య నభ్యసించాలంటే ఏఅంశాలపై ఎక్కువ మక్కువ ఉంటుందో దానినే ఎంచుకోవాలని సూచించారు. తమ భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. క్రమశిక్షణ కలిగి, వేరొకరికి ఆదర్శంగా నిలవడానికి ప్రయత్నించాలన్నారు. కెరీర్ కౌన్సిలర్ ఆర్ విజయకుమార్ ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయురాలు కే శివజ్యోతి, మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాలకు వెళ్లడానికి లక్ష్యంతో పనిచేయాలని పట్టుదలతో చదివి జ్ఞానం సంపాదించాలని, జ్ఞానంతో లక్ష్యాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ కేజె కెనడీ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభాస్థలి వేదిక పనుల పరిశీలన



దెందులూరులో సభాస్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు అబ్బయ్యచౌదరి, వెంకట్ గౌడ్

దెందులూరు: దెందులూరులో ఈ నెల 25న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరు కానున్న సభాస్థలం ఏర్పాటు పనులు చకచకా జరుగుతున్నాయి. సోమవారం దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, పలమనేరు ఎమ్మెల్యే వెంకట్ గౌడ్, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గంటా ప్రసాదరావు, దెందులూరు మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని, పెదపాడు మండల పార్టీ అధ్యక్షుడు అప్పన ప్రసాద్ పరిశీలించారు. గట్లపై ఉన్న తాటిచెట్లు, తుప్పలు, మొక్కలు తొలగించి చదును చేయిస్తున్నారు. టెంట్లు వేసి గ్రౌండ్ పనులు వేగవంతమయ్యేలా నాయకులు పర్యవేక్షిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లు పళ్ళెం ప్రసాద్, మంతెన సూర్యనారాయణ, ప్రభాకరరావు, ఏలూరు మండల పార్టీ అధ్యక్షుడు తేరా ఆనంద్, వైఎస్సార్ సీపీ నాయకులు ఆళ్ళ సతీష్ చౌదరి, పోకల రాంబాబు, తొత్తడి వేదకుమారి, కట్టా ఏసుబాబు, చల్లా మేరీరాజు, కొంగర రత్నకుమార్ అబ్బాస్, కొలుసు గణపతిరావు, నియోజకవర్గ నాయకులు, అన్ని ప్రభుత్వ విభాగాల ఉద్యోగులు, సభాస్థలం ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

కంటి సమస్యలపై నిర్లక్ష్యం తగదు

గణపవరం: కంటికి సంబంధించిన సమస్యలపై నిర్లక్ష్యం వహించవద్దని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారి కిరణ్మయి అన్నారు. సోమవారం గణపవరం మండలం సరిపల్లె గ్రామ సచివాలయం పరిధిలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కంటివెలుగు కార్యక్రమంలో భాగంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 61 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరందరికీ కళ్లజోళ్లు అవసరమని ఆప్తమాలజిస్ట్ శ్రీనివాస్ తెలిపారు. సీహెచ్‌వో జాలాది విల్సన్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

నేడు రాగి జావ పంపిణీ

గణపవరం: ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఈనెల 21వ తేదీ మంగళవారం ఉదయం పది గంటలకు గణపవరం వర్తక సంఘ భవనంలో నిర్వహించనున్న మానవత స్వచ్ఛంద సంస్థ సేవా కార్యక్రమాల్లో ముఖ్యఅతిథిగా పాల్గొంటారని పార్టీ నాయకులు తెలిపారు. 10.30 గంటలకు గణపవరం బాలుర ఉన్నత పాఠశాలలో జగనన్న గోరుముద్ద కార్యక్రమంలో భాగంగా రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

వట్టి పార్థసారథి మృతి తీరనిలోటు

ఉంగుటూరు(గణపవరం): నారాయణపురం డిగ్రీ కాలేజి అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ, డీసీసీబీ మాజీ ఛైర్మన్ వట్టి వెంకటరంగపార్థసారథి మరణం తీరని లోటని నారాయణపురం అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా. కె.విశ్వేశ్వర రావు అన్నారు. సోమవారం కళాశాలలో వట్టి పార్థసారథి మరణంపై సిబ్బంది తీవ్ర సంతాపం తెలిపి ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్థసారథి తనయుడు మాజీ మంత్రి వట్టి వసంతకుమార్ సహకారంతో ఆయన కళాశాలలో నూతన భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారని అన్నారు.

వలంటీర్ పోస్టుల భర్తీ

ఏలూరు రూరల్: ఏలూరు మండలం చాటపర్రులో-2, తంగెళ్లమూడి-1, శనివారపుపేట-1 చొప్పున ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఈఓపీఆర్డీ ఎం సరళ కుమారి తెలిపారు. ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటలోపు ఆన్‌లైన్‌లో దరకాస్తు చేసుకోవాలని, 27న దరకాస్తుల పరిశీలన, 28న మౌఖిక పరీక్ష, 29న ఫలితాల వెల్లడిస్తామని పేర్కొన్నారు.

రూ.500 కోట్లతో అభివృద్ధి పనులు



ఎమ్మెల్యే కార్యాలయ ఆవరణలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజాప్రతినిధుల విస్తృత సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: దెందులూరులో ఈ నెల 25వ తేదిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ. 500 కోట్ల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే కార్యాలయ ఆవరణలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, సొసైటీ చైర్మన్లు, మండల పార్టీ అధ్యక్షులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలతో జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ దెందులూరులో చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రూ. 500 కోట్లతో అభివృద్ధి పనులను రాష్ట్ర ముఖ్యమంత్రి వచ్చి ప్రారంభించడం ఇదే ప్రథమమని తెలిపారు. నవరత్నాల్లో ఒక్కటైన వైఎస్సార్ ఆసరా పథకాన్ని రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు లబ్ధి చేకూరే విధంగా దెందులూరులో బటన్ నొక్కి ప్రారంభించడం ఎమ్మెల్యేగా తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు.వైఎస్సార్ ఆసరా పథకం దెందులూరులో ప్రారంభించడం దెందులూరు నియోజకవర్గంలో మహిళలందరికీ శుభవార్త కానుందన్నారు. ముఖ్యమంత్రి దెందులూరు పర్యటనను నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు విజయవంతం చేయాలని కోరారు. ఏలూరు జిల్లా పరిధిలో పెదవేగి, ముసునూరు గ్రామాల మధ్య ఉన్న తమ్మిలేరుపై రూ. 17 కోట్లతో బలివేపై వంతెన నిర్మించడానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. 25న ముఖ్యమంత్రి తాడేపల్లి నుంచి బయలుదేరి నేరుగా దెందులూరు ఉదయం 10 గంటలకు విచ్చేస్తారన్నారు. 10.30 గంటలకు సభా ప్రారంభమవుతుందని, 12 గంటలకు ముగుస్తుందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన పలమనూరు ఎమ్మెల్యే వెంకట్ గౌడ్ మాట్లాడుతూ దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి మంచి వ్యక్తితత్వం గల సేవానిరతిగల ప్రజాప్రతినిధి అన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు గంటా ప్రసాదరావు, పెదపాడు పార్టీ మండల అధ్యక్షుడు అప్పన ప్రసాద్‌లను దెందులూరు ఏఎంసీ మాజీ చైర్మన్ మేకా లక్ష్మణరావు అభినందించారు. సమావేశంలో నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అన్ని విభాగాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

శివునికి వెండి నంది సమర్పణ



ఆలయానికి వెండి నందిని సమర్పిస్తున్న దాత ముఖావరపు లక్ష్మీనారాయణ దంపతులు

భీమడోలు: పోలసానిపల్లిలో స్వయంభూ పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయానికి వైఎస్సార్ సీపీ నేత ముఖావరపు లక్ష్మీనారాయణ(బుజ్జిబాబు) దంపతులు సోమవారం రూ.27,500 విలువ గల చిన్న వెండి నందిని సమర్పించారు. 375 గ్రాముల వెండి నందిని ద్వారకానగర్‌కు చెందిన వైఎస్సార సీపీ నేత ముఖవరపు లక్ష్మీనారాయణ (బుజ్జిబాబు) దంపతులు ఆలయ అర్చకులు ఉండి భాస్కరరావుకు అందజేసి తమ భక్తిని చాటుకున్నారు. ఆలయ మర్యాదలతో లక్ష్మీనారాయణను సన్మానించారు. తొలుత ఆలయంలో అర్చకులు ఉండి భాస్కరరావు ప్రత్యేక పూజలు చేసారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ అంబటి నాగేంద్ర ప్రసాద్, వైసీపీ నాయకులు కనుమూరి బాపి రాజు, కోట శంకరం పాల్గొన్నారు.

యోగ సాధనతో సంపూర్ణ ఆరోగ్యం



ఇండోర్ స్టేడియంలో యోగా పోటీలు



యోగా పోటీల్లో పాల్గొన్న సాధకులు

ఏలూరు రూరల్: యోగ సాధనతో విద్యార్థులు మానసిక, శారీరక ఆరోగ్యం సాధించవచ్చని సెట్‌వెల్ సీఈఓ ఎండీహెచ్ మెహర్రాజ్ అన్నారు. 2023 ప్రపంచ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు సోమవారం ఏలూరులో క్రీడాధికారులు యోగా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా శాప్ జిల్లా చీఫ్‌కోచ్ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే క్రీడలు, వ్యాయామ సాధన చేయలని సూచించారు. క్రీడలు, ఆరోగ్యం పట్ల బాలికలు, మహిళల్లో అవగాహన పెంచేందుకు ఈ నెల 8వ తేదీ నుంచి 25 వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకు అథ్లెటిక్స్, వెయిట్ లిఫ్టింగ్, షటిల్, బాడ్మెంటెన్ తదితర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, పతకాలు అందించామని తెలిపారు. యోగా పోటీల్లో సైతం బాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారని వివరించారు. కార్యక్రమంలో కోచ్ షేక్ ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

పథకాలు ప్రతి విద్యార్థికీ అందాలి

ఏలూరు రూరల్: సంక్షేమ పథకాలు ప్రతి విద్యార్థికీ అందాలని రీజినల్ జాయింట్ డైరెక్టర్ జి.నాగమణి అన్నారు. సోమవారం ఆమె సత్రంపాడు జడ్పీ పాఠశాలను ఆమె సందర్శించారు. విద్యార్థుల నోట్, వర్క్‌బుక్స్, పరీక్ష పేపర్లను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం రుచి చూశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు 6000 నిమిషాలకు పైగా బైజూస్ కంటెంట్ వినియోగించాలన్నారు. ఉపాధ్యాయులు ఎఫ్ఏ-4 ఎగ్జామినేషన్, ప్రీ పబ్లిక్ ఎగ్జామినేషన్ పేపర్లు అనుకున్న సమయానికి విద్యార్థులకు అందించాలని, రాబోయే 10వ తరగతి పరీక్ష కోసం విద్యార్థులను సన్నద్ధం చేసేలా ప్రణాళిక రూపొందించుకోవాలని హెచ్ఎం జయరామన్‌కు సూచించారు.

మాజీ ఎమ్మెల్సీ వట్టి వెంకటరంగ పార్థసారథి కన్నుమూత



ఎంఎంపురంలో వట్టి వెంకటరంగ పార్థసారథి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు



ఎంఎంపురంలో అధికార లాంఛనాలతో పార్థసారథి అంత్యక్రియలను నిర్వహిస్తున్న దృశ్యం

భీమడోలు: ఉమ్మడి తెలుగు రాష్ట్రాల శాసన మండలి మాజీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నేత వట్టి వెంకటరంగ పార్థసారథి(92) కన్నుమూసారు. విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన ఆదివారం రాత్రి తుదిశ్వాస విడిచారు. పూళ్ల పంచాయతీ శివారు ఎంఎం పురంలోని స్వగృహానికి ఆయన మృత దేహాన్ని అంబులెన్స్‌లో తీసుకువచ్చారు. సొంత వ్యవసాయ క్షేత్రంలో ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో పార్థసారథి అంత్యక్రియలు నిర్వహించారు. పార్థసారథి చిన్న కుమారుడు, మాజీ మంత్రి వట్టి వసంతకుమార్ జనవరి 29న మృతి చెందడంతో ఆయన మానసికంగా కుంగిపోయారు. కొన్నేళ్ల క్రితం ఆయన భార్య మృతి చెందారు. జిల్లాతోపాటు రాష్ట్రంలో కీలక నేతలైన తండ్రీ, కొడుకులిద్దరూ 50రోజుల వ్యవధిలో మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అమలుకున్నాయి. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఆయన పని చేసారు. డీసీసీబీ చైర్మన్‌గా పని చేసారు. 1957 నుంచి 1994 వరకు పూళ్ల కోఆపరేటివ్ రూరల్ సొసైటీ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తాడేపల్లిగూడెంకు చెందిన అప్పటి మద్రాస్ రాష్ట్రం డిప్యూటీ స్పీకర్ పసల కనక సూర్యచంద్రరావు కుమార్తెతో పార్థసారధికి వివాహం జరిగింది.

పలువురు ప్రముఖుల నివాళి

ఎంఎంపురంలోని స్వగృహంలో ఉంచిన వట్టి వెంకట రంగ పార్థసారథి భౌతికకాయాన్ని పలువురు ప్రముఖులు సందర్శించి ఘన నివాళులర్పించారు. ఆయన పెద్ద కుమా రుడు రమేష్‌ను పరామర్శించారు. ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, రాజమండ్రి ఎంపీ ఉండవల్లి అరుణకుమార్, పుండరీకాక్షుడు, మాజీ ఎమ్మెల్యేలు గన్ని వీరాంజనేయులు, కొండ్రెడ్డి విశ్వనాథం, అప్కెడా వైస్ చైర్మన్ వడ్డి రఘురామ్‌నాయుడు, భీమడోలు ఎంపీపీ కనమాల రామయ్య, పూళ్ల, భీమడోలు, గుండుగొలను సొసైటీ అధ్యక్షులు, మానవత నాయకులు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు యర్రంశెట్టి ఏడుకొండలు, నియోజకవర్గ నేత హరికుమార్‌రాజు తదితరులు తరలివచ్చి పార్థసారథి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మృతికి సంతాప సూచికంగా పూళ్ల, భీమడోలు, గుండుగొలను సొసైటీతోపాటు నియోజకవర్గంలోని సొసైటీ కార్యాలయాలను మూసివేశారు.